# మట్టిదీపాలు

కూర్పాట్ల పడుతున్న డ్రైవర్‌ని చూసి పెద్దపాణాలు ఎల్లుకపోయినయ్ కాంతయ్యకు. రాత్రి రెండున్నర అయితంది. ఎన్నీల బియ్యప్పిండి లెక్కనే వున్నది. లారి స్పీడు కూడా బాగానే వున్నది.

"డ్రైవర్ సాబ్... నిద్రత్తుందా? సంపుతవా ఏంది" అన్నడు కోపంగా... ఆ మాటకు నిద్రపోయిన రాములు కూడా లేసిండు.

డ్రైవర్ రాంసింగ్ లారీని రోడ్డు పక్కకు ఆపి... సీసాల వున్న నీళ్లుదీసి మొకం మీద చల్లుకున్నడు.

"సింగూ... కొంచెం సేపు పండుకో... పొద్దుగాల పోదాం" అన్నడు రాములు ఆయిలింతలు దీస్కుంట.

లారీ మిర్చిలోడుతో వుంది.

"తెల్లారె వరకు నాగ్‌పూర్‌ల వుంటం... గిట్ల ఎన్నిసార్లు బండి నడుపలే... మల్ల రేపు రాత్రికల్ల జయితాల్న వుండాలె. లేకుంటె సేటు కోపానికత్తడు" అనుకుంట మల్ల బండి చాలు జేసిండు.

కాంతయ్య కడుపుల భయం చొచ్చింది. గుండె పిడ్సకట్టుకపోయినట్టు ఐబద్ దిన్నడు.

"నాగపూర్ చేరుతమా... నడిమిట్లనే చస్తమారా రాములు" అన్నడు.

రాములు నవ్వి... డ్రైవర్‌ని మాటల్ల పెట్టి నిద్రమబ్బు పోగొట్టాలె అనుకున్నడు.

పంచెలకెల్లి సర్వపిండి తీసిచ్చిండు.

కాంతయ్య, రాములు టొంబై కింటాల్ల మిర్చిని నాగపూర్ తీసికెళ్తుండ్రు. కాంతయ్యయి యాభై కింటాల్లయితే, రాములుయి నలుపయి కింటాల్లు. ఇద్దరి పొత్తుల లారి కిరాయికి తీసుకున్నరు.

"అవునోయ్ సింగు... మా బుచ్చన్న మొన్ననే నాగపూర్‌కు పసుపు తీసుకపోతె మీ సేటు అయిదువేలే దీస్కున్నడు. మేమెంత తక్కిచ్చి అడిగినా ఆరువేలకు తక్కువ లేదన్నడు. వారం రోజుల్లనే ఏం పుట్టింది?" అనడిగిండు.

"అన్నిటికి ఒకటే రేటుంటదా? మిర్చికి ఎక్కువుంటది పటేలా...

ఎందుకంటె మిర్చికి హైట్‌లోడ్ ఎక్కువకదా... బండి ఇస్లోగ పోవల్నాయె... జెరంత వంగినా మిర్చిబస్తాలు వట్టిగనే కూలుతయ్..., చెట్ల కొమ్మలు తాకకుంట పోవుడాయె" అన్నడు.

"మిర్చిబస్తాలు గట్టెట్ల కూలుతయ్... గట్టిగనే కడుతంగదా" అన్నడు కాంతయ్య స్టీరింగ్ దిక్కే చూసుకుంట.

ఎదురుంగ లైట్లు కండ్లల్ల కొట్టుకుంట సుమోలు, లారీలు, బస్సులు జిప్పజిప్ప పక్కకెల్లి పోతున్నయ్.

"గాట్ల మీదికెల్లి బండి పోయేటప్పుడు ఎట్ల ఎటమటం అయితదో చూసింద్రు కదా... జాగర్తగా నడుపాలే... లేకపోతె మీరే లాసయితరు" అని చెప్పిండు.

"మేమెట్ల లాసయితం?" అనడిగిండు రాములు. తాపకోసారి వస్తున్న కోళ్లఫారాల గబ్బు వశపడ్తలేదు.

"ఓపారి దరూర్ హన్మంతరావుది.. బొంబాయి మార్కెట్‌కి మిర్చి తీసుకపోతన్న... మజ్బూర్ గాట్ల కాడ మలుపు తిరుగంగనే లారి పక్కకు ఒరిగింది. బండి ఆఫ్‌జేసిన. అప్పటికి సగం బస్తాలు కిందగూలినయ్... వంద కింటాల్ల లోడు... నడిగుట్టల్ల పసాయించినం. ఎవడు బండి ఆపడు... కూలీలు దొరుకరు... మా గోస జూడాలె... హన్మంతరావ్ అయితే గొడగొడ ఏడ్సుడు... ఆ కాలకర్మానికి రెండ్రోజులు ముసురువెట్టింది. నేనే బొంబై పొయ్యి హమాలోల్లను తోలుకచ్చి మల్ల బర్తి నింపినం. సేపు పండోలె కలరుండె మిర్చి... జాంపండు లెక్క తెల్లవడ్డది. దూది లెక్క మెత్తవడ్డది." అన్నడు డ్రైవరు.

"గాచారం సాలకపోతె కుండలు కొట్లాడుతయ్ అంటె గదే మరి" అన్నడు కాంతయ్య.

"మార్కెట్ల మిర్చిని చూసి సేటుగాడు ఒకటే మాటన్నడు. ఏం లేదు దీన్ని

తీస్కపోయి సముద్రంల పారవొయ్యిండ్రి అంటడు. ఎంత బతిలాడినా దీస్కోలె. లాస్టుకు కింటాలుకు పదారువందలున్న మిర్చి తప్ప మిర్చి అయిందని కింటాలుకు తిపితిప్పి గొడితె ఇన్నూటయాభై చొప్పున లెక్క గట్టిచ్చిండు. హన్మంతరావు ఏడ్పు తరంగాలె. ఆ పైసల్‌దెచ్చి లారి కిరాయిగట్టిండు" అని చెప్పిండు రాంసింగ్.

ఆ కథంత విని కాంతయ్య గుండె అవిసిపోయింది.

పండిన సొమ్ము మార్కెట్లకు చేరేదాక కూడా రైతుకు నమ్మకం లేకుండా పోయింది అనుకున్నడు బాధగా...

"వడ్లు పండిచ్చుకున్నప్పుడు గిన్ని బాధలెక్కడియే కాంతన్నా... తిండికి నాలుగు పల్లాలుంచుకోని మిగితాయి బీట్ల పారవోసత్తె... నాల్రోజుల్ల పైసల్ చేతికచ్చేటియ్... పత్తి రకాలని, మిర్చి రకాలని, పసుపు రకాలని కాలాన్ని బట్టి పంటలని ఇత్తునాలిచ్చి ఇసం పెట్టినట్టు చేసిరి. లాగోడి వత్తదన్న నమ్మకమే లేకపాయె" అన్నడు రాములు.

"ఉప్పుతోని తొమ్మిది పప్పుతోని పది అన్నట్టు కొట్టే మందులకు ఇరాం లేదు. పుట్టే పురుగుకు సావులేదు. కాలం గూడా ఇంట్ల ఉప్పులం పుట్టినట్టే చెయ్యవట్టె" బాధగా అన్నడు కాంతయ్య.

లారీ నెమ్మదిగానే పోతంది...

అక్కడక్కడ దాబాల పక్కన లారీలాపుకొని ఇనుప తీగెల మంచాల కింద బొగ్గులు రాజేసుకొని వెచ్చగ నిద్రవోతుండ్రు డ్రైవర్లు, క్లీనర్లు

లారీ చంద్రాపూర్ దాటింది.

ఎదురుంగ టాటా సుమో గుద్దినట్టు రాంగనే జెప్పున స్టీరింగ్ తిప్పిండు రాంసింగ్. దాని లైట్లు కండ్లల్ల కొట్టినయ్.

"ఇంట్ల పెండ్లానికి చెప్పచ్చినావ్‌రా బోస్డికే" అని తిట్టిండు.

కాంతయ్య, రాములు పక్కకు ఇరుసుక పడ్డరు.

"జెరంత మెల్లగ తోలరాదోయ్... అవాయిజాజు లెక్కనే పోవడ్తివి" అన్నడు రాములు తీగురంగ...

"గింత దానికే బయపడ్తరా... నేనెన్ని మార్కెట్లు తిరిగితి... వందల పసుపు లోడ్లు సాంగ్లీ, గోండ్యా, గయా మార్కెట్లకు తీస్కపోయిన... నాగ్‌పూర్, అమ్మదాబాద్, కల్‌కత్తా, బొంబై మార్కెట్లకు మిర్చిలోడ్లు తీస్కపోయిన... గిప్పటిదాక ఇరువై రొండెండ్ల సర్వీస్‌ల ఒక్క టక్కర్ కూడా చెయ్యలె" గర్వంగా చెప్పిండు రాంసింగ్.

ఎదురుంగ వచ్చే వాహనాల లైట్లు కండ్లల్ల పడీ పడీ చీకట్లత్తన్నయ్. సర్రున పక్కల కెల్లి పాములెక్కనే పోతున్నయ్. ఒక్కోపారి పంచెడు పాణాలు పోతున్నటు బుగులైతంది.

"మెల్లగ... మెల్లగ పోనియ్" అంటుండ్రు ఇద్దరూ.

తెల్లారంగ ఆరింటికి లారీ నాగ్‌పూర్ చేరింది.

లారీని ఓ చోట ఆపిండ్రు... మార్కెటంత మిర్చి... పసుపు.. కాంతయ్య గంత దినుసు ఎన్నడు చూల్లె... రాములు నాలుగైదుసార్లు పసుపు దెచ్చిండు.

"నేను సేటుని కలిసత్త... అంతసేపు మొకం కడుక్కొని చాయె తాగుండ్రి" అని ఇద్దరికి చెప్పి పోయిండు రాములు.

అద్దగంట తర్వాత బెంగటీలినోనిలెక్కనే వచ్చిండు.

"ఏమైందిరా రామన్నా... రేటెట్లున్నది?" ఆదుర్దాగా అడిగిండు రామయ్య.

"నిన్న మనం బైలెల్లంగ కింటాల్‌కు నాలుగు వేలుండె... రాత్రికి రాత్రి దిగిందట. ఇయ్యాల్ల కింటాల్‌కు పద్దెనిమిది వందలు"

కాంతయ్య గుండె దడిల్లుమన్నది.

"గంత దిగుతాదిరా... సిండికేట్ అయింద్రు గావచ్చు. మరి ఇప్పుడేం చేసుడురా... సగం దిగినంక సందెనవడ్డట్టాయె" అన్నడు పెయ్యంత సల్లవడంగ.

"రెండు మూడు గంటల్లల్ల లోడు దింపుండ్రి... మల్ల నేను జయితాల పోవాలె. చత్తీస్‌గడ్‌కు గిరాకుంది. లేటయితే సేటు ఊకోడు" కొంచెం కఠినంగనే చెప్పిండు డ్రైవరు.

"ఆగరాదోయ్ సింగు... ఇల్లు కాలి మేమేడ్తన్నం..." అన్నడు కాంతయ్య.

ఇద్దరూ రందిల పడ్డరు... ఆలోచనల పడ్డరు...

గంటసేపు జాత్రల తప్పిపోయిన పోరగాండ్ల లెక్క మార్కెటంత తిరిగింద్రు... తల్లిలేని కోడి పిల్లలెక్క ఆగమాగం తిరిగింద్రు.

వేల మంది... ఎవల్నెవలు పట్టించుకుంటలేరు... రేటు గంతెట్ల దిగుతదని కొందరు సేట్లతోని లొల్లిపెట్టుకుంటుంద్రు... సగం మరాటి భాష... సగం తెలుగు... మార్కెటంత గాయి గాయి అయింది. గత్తెరవడ్డట్టయింది.

కాంతయ్య సుట్టపోడు లచ్చిరాజం కల్సిండు. వాళ్లది వరంగల్ జిల్లా వర్దన్నపేట. లచ్చిరాజమే కాంతయ్యని గుర్తుపట్టిండు. ఇంటి విషయాలు మాట్లాడుకున్నంక... "వరంగల్లనే మార్కెటుంది కదనే... నువ్వుగూడా నాగపూరచ్చినవేంది?" అని అడిగిండు.

"ఎక్కన్నే కాంతన్నా... మార్క్‌ఫెడోల్లు మిర్చి కొన్నంక పైసల్ తర్వాత ఇస్తమని టోకెన్లు ఇస్తుంద్రు. అప్పుదెచ్చిన కాడ మిత్తి పెరుగదానె... రైతులంత దళారోల్లకే అమ్ముకుంటంద్రు. ఆల్లు మన రైతుల పేరుతోనే మార్క్‌ఫెడ్‌ల అమ్మి టోకెన్లు తీసుకుంటుంద్రు. పైసల్ నెలకిచ్చినా... కింటాల్‌కి ఏడువందలు దళారోనికే లాభమాయె. ఇగ రైతుకు లాభమెక్కడిదే. గందుకే నా మిర్చిని ఇక్కడికి తీసికెచ్చిన.

పర్వతం బోయి పండ్లాడగొట్టుకున్నట్టు... ఇక్కడ ఇంకింత దిగింది" అని బాధపడ్డడు.

"మరేం చేద్దామనుకుంటున్నవే. ధర గిట్లుండే. మాక్కూడా ఏం సోచాయించుతలేదు" అన్నడు రాములు.

"నాలుగైదు రోజులు ఇక్కన్నే వుండాలె... రేటు ఎప్పుడు పెరిగేది తెల్వదాయె... సేట్లకేమో ఫోన్లుండె... దేశంల ఏ మార్కెట్ల ఏది పెరిగిందని జెట్టన తెల్సె. మనకెవడు జెప్పాలె" అన్నడు లచ్చిరాజం.

మిర్చిని లారీలకెల్లి గోడాన్‌లకు దించిండ్రు...

తాల్లు తంగెల్లు పట్టినట్టు అయిదు రోజులు హోటల్లల్ల గంటె జారుడు పప్పు రొట్టెలు తినుకుంట తడకప్పల్లెక్క తండ్లాడిండ్రు... తల్లి కడుపుల పొద్దు పడేదాక మార్కెట్లనే తిరుగుడు... కిరాయి మంచాలు దీస్కొని పండుడు... ఆ తిండికి, నీళ్లకు రాములుకైతే కిసర్‌బైలు పెట్టింది.

రోజు రోజుకు ఆశలు సన్నవడ్డయ్... జేబుల పైసలు దగ్గరపడ్డయ్... మొకాలు కడదప్పినయ్...

"సముద్రంల తుఫాన్ లేసిందట... మిర్చి సింగపూర్ పోయేదాయె... ఇంక పదిరోజుల్దాకా ధర గిట్లనే వుంటదట్నే..." అని వార్త మోసుకచ్చిండు లచ్చిరాజం.

"మరెట్లనే... నాలుగు వందలు పెరిగిందంటుండ్రు గదనే" అన్నడు కాంతయ్య.

"రెడ్ టాప్ రకం పెరిగిందట... మన జిటి మిర్చికి ధరలేదంటుండ్రు.." బాధగా చెప్పిండు లచ్చిరాజం.

అడివీల పొద్దుగూకినట్లే వుంది. కడుపుల బాధ మాటలు రానిత్తలేదు.

రైతు బతుకు పంచపాల బోర్లవడ్డట్టే కావట్టే అనుకున్నరు. మనసులంత గాలి దుమారం లేసినట్టే వుంది. చివరకి ధర పెరిగినంకనే అమ్మాలని నిర్ణయానికచ్చిండ్రు...

"మరయితే శీతల గిడ్డంగుల్లల్ల పెట్టి పోదాం రాండ్రి" అన్నడు లచ్చిరాజం. వాటి గురించి రాములుకి, కాంతయ్యకి ఎక్కువగా తెల్వది.

పోతుంటె... ఎస్టీడి బూత్ కనవడ్డది.

"ఒపారి ఇంటికి ఫోన్‌గొడ్త ఆగుండ్రి... ఇంట్లోల్లు పరేశానైతుండ్రు గావచ్చు" అని బూత్‌లోకి నడిసిండు. కాంతయ్య ఫోనెత్తి నెంబర్లు కలిపిండు.

అవుతల్నుంచి చిన్న బిడ్డ సుజాత ఎత్తింది.

"బడికి పోలేదా బిడ్డా... అందరు మంచిగున్నరా?" అనడిగిండు.

"బాపూ... గా బాలయ్య పెద్దబాపు లేడానే... పత్తి అమ్మితే లాసచ్చిందని ఇండ్రీన్ తాగి సచ్చిపోయిండు. అందరేడ్తండ్రు..." అన్నది.

ఆ మాట విని కాంతయ్య గుండెల్ల ఎలగడ తగిలినట్లయింది.

"ఏంది బిడ్డా... నిజంగానా... గట్లెట్ల చచ్చిపోయిండే" అన్నాడు మాటలు పెకిలిచ్చుకుంట....

ఫోన్ బిడ్డ చేతిలకెల్లి భార్య తీసుకున్నట్టుంది.

"అమాయె... అటేవోతిరి... బాలయ్య మామ చచ్చిపోయిండని మొస పోసుకుంట ఉరికురికచ్చేవు. నువ్వచ్చేదనుక పీనుగుండది... ఇప్పుడే పాడె గడ్తుండ్రు... దప్పుల సప్పుడైతంది... మిర్చి మొత్తం అమ్మినంకనే రా... ధర మంచిగున్నదా?"

కాంతయ్య ఫోను పెట్టేసిండు...

గుడ్లల్ల నీళ్లు మత్తడి దునికినయ్... బాలన్న బొచ్చెల మెరుత్తండు... చెవుల్లల్ల సొవు దప్పు ఇనత్తంది. కండ్లు ఎద్దుపుండ్ల లెక్కయినయి... దుఃఖం ఆపుకుంట భుజం మీది పంచెదీసి నోటికడ్డం పెట్టుకున్నడు.

"ఏమైందే... అందరు మంచిగున్నరట్నా?" అనడిగిండు రాములు.

"ఏం మంచిగరా... మిర్చిని అండ్ల పారేసి పోదాం పా... బాలన్న పానం దీస్కున్నడట" అన్నడు మొకమంత చెమట పట్టింది. కండ్లల్లకెల్లి నీల్లు పటపట పడ్డినయ్...

"మీ పాలోల్ల బాలయ్యనానె... అయ్యో... గట్లెట్లయిందే" అన్నడు అప్పుడే లచ్చిరాజం ఆటోదీస్కొని వచ్చిండు.

"రాండ్రి... శీతల గోదాముల కాడికి పోదాం" అని ఏగిర్తపెట్టిండు.

ముగ్గురు ఆటోల కోల్డ్ స్టోరేజ్‌ల దగ్గరికి చేరిండ్రు... ఆకాశాన్ని తాకుతున్నట్టు పెద్ద పెద్ద పొడువాటి బిల్డింగ్‌లు... అక్కడా తమలాంటి రైతులు ఏదో పోగొట్టుకున్నట్టు బేజారై తిరుగుతుండ్రు...

'హీనా కోల్డ్ స్టోరేజ్' ఆఫీస్‌ల కెల్లి 'మిర్చి బస్తాలు పెట్టుకోవాలె' అని అడిగిండ్రు... "మా స్టోరేజ్ ఖాళీలేదు. వేరెయి చూస్కోండి" అన్నడు వాడు.. హిందీల నిర్లక్ష్యంగా...

ఇంకో కోల్డ్ స్టోరేజి దగ్గరికెల్లిండ్రు...

"పసుపు చింతపండు తప్పితె మిర్చిపెట్టుకోం... ధరల్లేక గిరాకి బాగున్నది. మిర్చి వంద బస్తాలు పెట్టిన ప్లేసుల... పసుపు నూటయాభై బస్తాలు పెట్టచ్చు" అన్నడొక కోల్డ్‌స్టోరేజ్ మేనేజర్.

"ఇదే మోక అని ఈల్లు గూడా దోసుకుంటుండ్రు"తిట్టిండు లచ్చిరాజం.

ఏ కోల్డ్‌స్టోరేజ్ చూసినా నిండిపోయే వుంది. ఎక్కడికెల్లినా ప్లేస్ లేదు అంటుండ్రు.

ముగ్గురికి చెమటలు పోసినయ్...

కాంతయ్యకు మాటిమాటికి బాలన్న యాదికస్తండు. మనసంత వడి పెట్టినట్టయితంది. రెండు గంటలు కాట గల్సినట్టు కోల్డ్‌స్టోరేజ్‌ల పొంట తిరిగిండ్రు.. లచ్చిరాజం గిడ్డంగులోల్లను తిడుతండు.

"ఈ కాలంల గీ శీతల గోదాంలచ్చినయ్ గని... ఎనుకట సాంగ్గీల... అటికీలు అనేటియి వుండె... పసుపు పట్టుకత్తుం... పెద్ద పెద్ద బాయిలు తవ్వి... ఆ బాయిల్ల పసుపు పోసి నిల్వజేసెటోల్లు... బాయిల్ని కమ్మలతోని, మట్టితోని మూసేత్తురు... అటికీల కాన్నే పసుపుకొనేటోల్లు... గింత తిప్పలెక్కడియ్" అనుకుంట లచ్చిరాజం మరో కోల్డ్ స్టోరేజ్ ఆఫీస్ గదిలోకి తీసికెల్లాడు.

"మిర్చిదెచ్చినం సార్.. మీ గోదాంల ఖాళీ వుందా" అనడిగిండు రాములు. రిజిష్టర్‌ల ఏదో రాసుకుంటున్న గోదాం క్లర్కు ఏం పట్టిచ్చుకోలే...

"ఏదో ఒకటి చెప్పుండ్రి సారూ... మిర్చి పెట్టుకోవాలె" అన్నడు లచ్చిరాజం కోపంగా.

క్లర్కు కండ్లద్దాలకెల్లి ఓపారి చూసి... "పెట్టుకుంటం... కాని సీజనల్ రేటు" అన్నడు.

"సీజనల్ రేటంటే..." అడిగిండు రాములు గీసరిల్లుకుంట.

"కింటాల్‌కి ఎనభై రూపాయలు... సీజనల్ రేటంటే ఒక్కరోజుకైనా గదేరేటు. నెల రోజులకైనా గదే రేటు... నెల దాటితే డబుల్" అన్నడు.

ముగ్గురు మొకాలు జూసుకున్నరు.

"ధర ఇప్పట్ల పెరిగెటట్లు లేదు. ఆల్సెంజేత్తె ఆయింత జాగ దొరుకది. ఏం చేద్దామే కాంతన్నా..." అనడిగిండు లచ్చిరాజం.

కాంతయ్యకు తిరిగి తిరిగి పల్లేరుకాయల్ల బోర్లిచ్చినట్టయితంది.

"ఎంత పండిచ్చినా గుట్టకు రాల్లు మోసినట్టే కావట్టె... చేసేదేముందే... పెడుదాం" అన్నడు. అందరి మొకాలు నిద్ర ఆగారాల్లేక నెరివడ్డట్టయినయి. బట్టలు గుడ్డికాయ పడ్డట్టయినయ్.

"మొత్తం పైసలు ఇప్పుడే కట్టాలె... తర్వాతంటె పైసల్ కట్టినంకనే బస్తాలిస్తం" అన్నడు.

"అమ్మేటప్పుడే కడుతం తియ్యుండ్రి" అన్నడు లచ్చిరాజం.

క్లర్కు కూలీల్ని పిలిచిండు.

"కూలి బస్తకు అయిదు రూపాయలు... వేసినపుడు అయిదు. మల్ల తీస్కున్నప్పుడు అయిదు. మొత్తం ఎన్ని క్వింటాల్లో లెక్కవెట్టి కట్టియ్యుండ్రి" అన్నడు.

"మిర్చి బస్తాలు తీసుకత్తం" అన్నడు రాములు.

"సీజనల్ రేటు మధ్యల పెరుగొచ్చు... ఒక్కోసారి బాగా తాకిడి వుంటె బస్తాకి పది నుంచి ఇరవై రూపాయలకు పెంచుతం. అట్లయితేనే ఉంచుకోవాలి. ఈ కాయిదాల మీద సంతకాలు పెట్టుండ్రి" అన్నడు

ముగ్గురు దస్కత్‌లు పెట్టిండ్రు.

పెద్ద భవనం లాంటి కోల్డ్ స్టోరేజి పక్కనే షెడ్‌లో రెండు కంప్రెషర్లు వున్నాయి. కండెన్సర్ వుంది. పెద్ద అమ్మోనియం గ్యాస్ ట్యాంకు. కరెంటు పోయినప్పుడు వెంటనే అవసరమయ్యే పెద్ద జనరేటర్లు రెండున్నాయి.

కోల్డ్ స్టోరేజి షటర్‌పైకి లేపి లోపలికి తీసికెల్లిండు.

నాలుగు నుంచి అయిదు డిగ్రీల చల్లదనం తాకింది. ఇనుప జాలి నేసినట్టు.. బేలుకట్టు లెక్క అరలు అరలుగా ఫ్లోర్లు... పెద్ద పెద్ద చాంబర్లు.

లోపల ఒక కొత్త ప్రపంచం లాగున్నది. సర్కస్ బోనుల చొచ్చినట్టున్నది...

మిర్చి, పసుపు, చింతపండుల వాసన కల్సిపోయి కొంచెం గెదడు గెదడోలె వస్తుంది కాంతయ్య లెక్కలేసిండు...

"ఒక్కొక్క చాంబర్‌ల యాభైవేల బస్తాలు పడుతయ్... ఆరు ఫ్లోర్లల్ల పన్నెండు చాంబర్లు ... అంటె ఆరు లక్షల బస్తాలు పడుతయ్... రేటు పెరిగిన కొద్దీ గోదాం ఖాళీ అయితది. ఒక్క రోజుకైనా గదే రేటాయె... నెలకు పది పన్నెండు లక్షలు ఎటూపోవురా రాములు" అన్నడు.

"కరెంటు బిల్లు ఓ రెండు లచ్చలేసుకోరాదే... నీయవ్వ... రైతుతోని ఎంత లాభపడ్తుండ్రే" అన్నడు రాములు.

"కూలీ పైసలు మనమే ఇచ్చుకోవాల్నాయె. సీజనల్ రేటని పెట్టి ఎంత దోసుకుంటుండ్రే... పుక్యానికి పెట్టుకుంటున్నట్టు జాములు" తిట్టిండు లచ్చిరాజం

"కింది చాంబర్లన్ని నిండిపోయినయ్... అయిదు ఫోర్లల్ల ఖాలీ లేదు. ఆరో ఫ్లోర్‌ల పెట్టుకోవాలె" చెప్పిండు క్లర్కు మరాఠీ భాషల.

వెంట వచ్చిన ఒక కూలీ చెప్పిండు.

"ఒక్కో ఫ్లోర్‌కు ఒక్కో రూపాయి ఎక్కువ తీసుకుంటం... మీదికి ఎక్కాల్నాయె... ఈ చలికి కాల్లు చేతులు వణికి కింద పడ్డమనుకో... బొక్కలిరుగుతయ్... మీరు బస్తకి ఏడు రూపాయలు చొప్పున కట్టియ్యుండ్రి"

అన్నడు.

"గదేంది... ఇప్పుడు అయిదు రూపాయలే అంటిరి గదా" అనడిగిండు కాంతయ్య.

"కింది ఫ్లోర్కయితే అయిదు రూపాయలు... పైకెక్కాలె గదా... మీ ఇష్టం" అని వెనుకకు తిరిగిండు.

"అయితమానె... ఏం చేద్దాం పెట్టుండ్రి" అన్నడు లచ్చిరాజం. మల్ల ఏదన్నా లారీలస్తే ఈంత జాగ దొరుకదన్న భయంతోని.

"ఈ చలికి మొలుకలు రావానే కాంతన్నా" అనడిగిండు రాములు.

"రంగు మారకుంట ఉంటయి... మొల్కలేం రావు" చెప్పిండు కాంతయ్య.

లచ్చిరాజం రెండు ట్రాక్టర్లు మాట్లాడి మిర్చి బస్తాలు ప్లాంటుకు జార గొట్టుటానికి పోయిండు. "నూరు కింటాల్లకు ఎనిమిది వేలు, పదారువేలు వీనికే పాయె. ట్రాక్టర్లకు కిరాయిచ్చుడేనాయె. కూలోల్లకు బాగానే పాయె... రేటు గురించి ఈ వూరికి ఫోన్లు చేసినప్పుడల్లా నూర్లకు నూర్లు ఫోన్ బిల్లాయె... లారి కిరాయి వేలకు వేలేనాయె... ఇగేం ఫాయిదుందే కాంతన్నా... లాభం గువ్వలకచ్చినట్టేనాయె" అన్నడు రాములు.

"రైతును దోసుకోనోడెవ్వడ్రా రాములు... ఊరు కాని వూర్లెకూడా గిట్ల దోసుకోవట్టి...

మన అవతారాలు జూత్తె హమాలీల కన్న కడీనం అయినయ్... ఎవ్సం అంటే యాపారం కాదురా... మన బతుకు! కాని మన బతుకుల్ని గిట్ల యాపారం

జేసింద్రు... లేకుంటె బాలన్న ఎట్ల చచ్చిపోయింద్రా?" బాధని దిగమింగుకుం ట చెప్పిండు కాంతయ్య.

బస్తాలు రాంగనే... కూలీలు ఒడుపుగా చకచకా ఫ్లోర్‌లెక్కుతూ బస్తాలని చాంబర్లలో సర్దుతున్నరు. "ఆర్నెల్లు, యాడాది దీంట్ల దాసుకుంటె కట్టమంత మంది బొందల వెట్టినట్టె. ఈ బస్తాలు దీంట్ల పారేసినంక బస్సెక్కుదామె కాంతన్నా... నాక్కూడా మనసున వడ్తలేదు" అన్నడు రాములు.

కోల్డ్ స్టోరేజిలోని చలిని కూడా మర్చిపోయినట్టు... మనసూ, శరీరం మొద్దబారినయ్...

బస్తాలన్నీ సర్దినంక కూలి పైసలిచ్చి... లచ్చిరాజంను అలాయ్ బలాయ్ దీస్కోని గుండె బరువుతో తిరుగు ముఖం పట్టింద్రు..

"ధర ఎప్పుడు పెరుగుతదో... మల్ల ఎప్పుడత్తమో..." అనుకుంట రోడ్డెక్కింద్రు.. ఓపారి ఎనుకకు తిరిగి చూసింద్రు. గొర్లమందని మింగి... ముడుసుకొని నిద్రవోతున్న కొండ చిలువ లెక్క కనవడ్డది... కోల్డ్ స్టోరేజి ప్లాంటు.

XXX XXX XXX

మబ్బుల్నే ఇంటి ముంగట ఊడ్చి... అలుకు చల్లివచ్చింది కాంతయ్య భార్య గంగవ్వ.

"ఏమాయె... పొద్దుగాల్నే బాలయ్య మామ బొందకాడికి పోయి మొక్కివత్తనంటివి. ముసుగు తన్నినవ్... పొద్దెక్కుతంది... లే... అట్లనే ఆల్లింటికి పోయి మందలిచ్చిరా" అన్నది.

నాగ్‌పూర్ నుంచి రాత్రి ఇంటికి చేరిన కాంతయ్య నిజానికి నిద్రపోలేదు. లేచి కూసున్నడు. జెరమచ్చినట్టు పెయ్యంత సవసవ అంటంది. కడుపంత పుల్సురమేసినట్టు మండుతంది. బలిమీటికి లేచి యాపపుల్ల నోట్లేసుకున్నడు.

"ఏమన్న పైసలచ్చేటట్టు నువ్వన్న జెయ్యరాదు... రైతులు చచ్చిపోతె ఇచ్చే పైసలు కూడా మింగవట్టి..." అన్నది గంగవ్వ.

"బాలన్న కుటుంబానికి పైసలత్తయే...నూరు విధాల రావాలె" అన్నడు పుల్లతో పండ్లు తోముకుంట.

"ఏమచ్చేటట్టున్నయ్... ఈ వూరికి రీతి రివాజుందా? గా బోయపోతు లింగన్నకచ్చే పైసలు... ఉరి పెట్టుకొని చచ్చిపోయిన ఎంకటిగానికచ్చినయట... లచ్చ రూపాయలు...."

ఆ మాట విని కాంతయ్య నోరు చేదెక్కింది.

"ఎంకటిగాడు రైతెట్లయితడే... ఆడు పెండ్లాం బాధకు చచ్చిపోయిండు గదా" అన్నడు.

"గదే మరి... రసురుసులు కావాల్నని సోకుల ఆడిదాయె ఆని పెండ్లాం. దాని రంపం పడలేకనే ఆడు సచ్చిపోయిండు. సత్తెనువ్వు ముండ అర్వగోస పడ్తది అనుకున్నడు... ఆడు సర్పంచి పాలేరాయె. ఇంటెనుక అద్దగుంట పత్తి నాటుకున్నందుకు... సర్పంచి ఆపీసర్లకు ఆన్ని రైతులెక్క చూయించిండు. ఆపీసుల్ల ముప్పయ్‌వేలు దులిపిండట. మిగతా పైసల్ల సగం సర్పంచికి... సగం ఎంకని పెండ్లానికి... అదిప్పుడు అర్గండి చీరెలు కట్టి ఎట్ల తిరుగుతుందో చూసినవా..." అన్నది.

కాంతయ్య నోట్లో వేపపుల్ల సర్రున గుచ్చింది. చిగుర్లకెల్లి రక్తం కారింది. "థూ... నీయవ్వ... రైతుని గింతమంది కోసుకతిన్నంక ఎట్ల బతుకుతడే" అని ఊంచిండు.

ఎర్రగ నెత్తురు వడ్డది.

ధనధనా తయారు కాంగనే... రాములు కూడా వచ్చిండు.

"లేసినావె కాంతన్నా... పానమంత సొడసొడలైంది. అయిదెకురాలు దున్నినప్పుడన్న గిట్ల కాలే... కాళ్లేతులు ఇగ్గుకపోతన్నయ్" అన్నడు పందిట్ల మంచం కాల్లకట్టకు కూలవడుకుంట.

"నాక్కూడ గట్లనే వుందిరా... ముందుగాల చేనుకాడికి పోయద్దాం రా" అని నడిసిండు... గప్పుడే తెల్లారుతంది...

"మిర్చి నాగపూర్‌ల పెట్టత్తిమి... దాసిదాసి దయ్యాల పాల్జేసినట్టయితది కావచ్చు" అనుకున్నరు. ఇద్దరు కల్సి బాలయ్య చేనుకాడికి నడిసింద్రు.

ఎండిపోయిన చేను మధ్యల... తెల్లటి సమాధి...

సమాధి గూట్లె గాలికి లిపలిప కొట్టుకుంటున్న దీపం...

సమాధి ముంగట కాంతయ్య మోకాల్ల మీద వంగి నేలపై నుదరు ఆనిచ్చిండు. కండ్లల్లకెల్లి నీళ్లు జలజల జారిపడి... భూమిల ఇంకినయ్.

గుండె పగిలింది...

"అన్నా... ఎంత పని చేసినవే... నువ్వు గిట్ల చేత్తవని కలల కూడా

అనుకోలేదే" అనుకుంట ఏడ్చిండు.

రాములుకు ఊకుంచ తరం కాలే...

"ఊకోయే కాంతన్నా... చచ్చినోడు లేసత్తాడే... భూమ్మీద గంతే బాకిల పడ్డడనుకోరాదే..." కండ్ల నీళ్లు తుడుసుకుంట ఓదార్చిండు.

"ఆఖరి చూపుకన్న నోసుకోకపోతి కదనే అన్నా... నువ్వు మారాజోలె బతికినోనివే అన్నా... గిట్లెట్ల జరిగిందే అన్నా..." బొచ్చె అంత గుద్దుకుంట ఏడ్చిండు.

"సల్ల చెముటలత్తన్నయే... ఊకో..." గదమాయించిండు రాములు.

రెండు పిడికిల్లల్ల మట్టిని దీస్కున్నడు కాంతయ్య... పూనకం వచ్చినోని లెక్క వూగిపోయిండు.

"అయ్యా... సర్కారోల్లూ... అధికార్లు...

మాకు ఇత్తునాలు ఇయ్యకుండ్రి... సబ్సిడీలియ్యకుండ్రి... టోకెన్లు ఇయ్యకుండ్రి... అప్పులియ్యకుండ్రి...

కొంచెం దైర్నమియ్యుండ్రి...

కొంచెం ధైర్నమియ్యుండ్రి..."

గొంతు నరాలు తెగిపోయేటట్లు ఏడ్చిండు... రాములు పంచెతోని కండ్లు తుడిసిండు...

దుఃఖాన్ని దిగమింగుకుంట చూసిండు కాంతయ్య. మసక మసకగా... సమాధి అవుతలి నుంచి... నాగలి వస్తోన్న దృశ్యం...

రెండు బక్కచిక్కిన తెల్లటి ఎడ్లు... నాగలి... భూమి పొరని చీల్చుకుంటూ

నాగలి... దగ్గరగా... మరింత దగ్గరగా...

ఒడిసి పట్టుకున్న నాగలితో... బాలయ్య భార్య... సత్తెవ్వ.

వెనుకే ఆరేళ్ల కొడుకు... సాలు పొంట మక్క గింజలు వేసుకుంట...

నాగలి దగ్గరగా వచ్చింది...

"అవ్వా... నువ్వు నాగలి పట్టినవా బిడ్డా..." అన్నడు ఏడ్సుకుంట చేతులు జోడిచ్చి...

"నాకు ధైర్నముందే కాంతన్నా... కాని... నా పెనిమిటి చచ్చిపోలేదే... చంపింద్రు... ఎవలు చంపింద్రో గని పైసల కోసం చచ్చిపోయిండని నిందలేత్తంద్రు.. మనిషే బోయిండు... నిందలెంతనే... ఆ చంపినోడు మాత్రం ఎవలో సమజైతలేదే... అస్సలు సమజైత లేదు..."

అనుకుంట నాగేటి సాల్లతో నడిసిపోతంది.. కల్తీలేని కన్నీటి విత్తనాలు చల్లుకుంట !!

*